

జోరుగా రేషన్ దందా..
బాల్కొండలో రేషన్ దందా జోరుగా సాగుతోంది. వివిధ మార్గాల్లో మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు రేషన్ బియ్యం తరలుతోంది.
- 8లో ▸



రైతుల్లో నిరాశ..
యాసంగి మక్కల ధర తగ్గిపోయి రైతుల్లో నిరాశ నింపింది. గత సీజనుతో పోల్చితే ధరలో చాలా వ్యత్యాసం ఉంటోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /17.5

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సెకండ్ స్పెల్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో శనివారం సెకండ్ స్పెల్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ప్రయోగ పరీక్షలు జరుగుతున్న కోటగిరి, బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు విజేత, ఉషోదయ, విద్యావికాస్ కళాశాలలను డీఐఈవో రవికుమార్ తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో జియో ట్యాగింగ్ చేయాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు డీఐఈవో సూచించారు. నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎడపల్లి మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు.

ప్రజావాణి వాయిదా

నిజామాబాద్‌అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

8 మంది టీచర్లకు డిప్యుటేషన్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో 8 మంది టీచర్లను డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు కేటాయిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్పల్లి మండలం దుబ్బాక ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు స్వప్న, శ్యామ్‌లను ఇదే మండలంలోని డిబితండా ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. దుబ్బాక ఉన్నత పాఠశాలలోని మరో స్కూల్ అసిస్టెంట్ కిషోర్ బాబును ధర్పల్లి మండలం చల్లగరిగే ఉన్నత పాఠశాలకు కేటాయించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ రాకేష్‌ను పూలాంగ్ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. పూలాంగ్ ప్రాథమిక పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నాగరాజును కోటగల్లి ఉన్నత పాఠశాలకు కేటాయించారు. కోటగల్లి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ గంగాకిషన్‌ను జిల్లా కేంద్రంలోని సర్వ శిక్ష అభియాన్ కార్యాలయానికి కేటాయించారు. అలాగే గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ అన్వర్ బేగంను ఆటోనగర్ ప్రైమరీ స్కూల్‌కు కేటాయించారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అహ్మద్‌ను ఆటోనగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



నిజామాబాద్‌నాగారం: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. నగరంలోని సీతారాం నగర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది రోగులతో మర్యాదగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వను, టీకాలు నిల్వచేసే ల్యాబ్‌ను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ అన్ని అంశాల్లో ముందుండాలని సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, ఫార్మసిస్టు సూపర్‌వైజర్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలి



వర్ని: సనాతన ధర్మాన్ని హిందువులు రక్షించుకోవాలని, ఐక్యంగా ఉండి ధర్మాన్ని కాపాడాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కమలానంద భారతి స్వామి అన్నారు. వర్ని మండల కేంద్రంలో శనివారం రాత్రి సమితి ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. హిందువులు సంఘటితంగా ఉండి దేవాలయాల ఆస్తులను సంరక్షించుకోవాలని, గోమాతలను రక్షించుకోవాలని సూచించారు. మల్లారం స్వామి బాలయోగి కృష్ణ మహరాజ్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రసాద్, సుబ్రహ్మణ్య స్వామి, జనార్దన్, నగేశ్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం



అపురూప శిల్పకళానిలయంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన జిల్లాలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం (దీక్షానగరం) శ్రీ సీతారామ చంద్ర స్వామి సప్తాహిక ధ్వజారోహణ, తిరుక్కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు వారం రోజుల పాటు ఈనెల 14 వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈనెల 10న సీతారాములవారి కల్యాణం నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

–డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్)

సండే స్పెషల్

ఖిల్లా రామాలయం

- ఆలయ గోడలపై ఆకట్టుకునే శిల్పకళా సంపద
- ద్రావిడుల సంప్రదాయం, విజయనగర రాజుల శిల్పరీతి
- వైభవంగా ప్రారంభమైన తిరుక్కల్యాణోత్సవాలు
- వారం రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు


డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో కొలువైన శ్రీసీతారామ లక్ష్మణులు

చక్కని కళాత్మక శిల్పాలతో శతాబ్దాల కిందటి కళాచాతుర్యానికి, చారిత్రక ఆనవాళ్లకు ప్రతిబింబంగా నిలుస్తోంది జిల్లాలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం. డిచ్‌పల్లి గ్రామానికి దక్షిణ దిశలో ఊరి చివర 60 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై ఈ ఆలయాన్ని నిర్మించారు. 16వ శతాబ్దంలో నిర్మితమైన ఈ ఆలయంపై పలు భిన్నకథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఆలయ శిల్పకళను తిలకిస్తే ద్రావిడుల సంప్రదాయ ప్రభావం కనిపిస్తోంది. ఈ ఆలయం విజయనగర రాజుల శిల్పరీతిని చూపుతోంది. 13వ శతాబ్దం మధ్యకాలంలో రామరాయల హయాంలో దీన్ని నిర్మించి ఉండొచ్చని భావిస్తున్నారు. మరికొందరు 14వ శతాబ్దంలో నిర్మితమైందని చెబుతారు. దీనిని వైష్ణవులు నిర్మించారా లేక శైవులు నిర్మించారా అనే విషయంలో స్పష్టత లేదు. గర్భ గుడి మధ్యభాగంలో ఎత్తయిన రాతి సింహాసనం ఉంది. సింహాసనం ఎడమ భాగాన మూల విగ్రహాలు ప్రతిష్ఠించక ముందు నుంచి రెండు విగ్రహాలు ప్రతిష్ఠించడానికి అనువుగా నిర్ధారిత పరిమాణంలో రెండు సాంచలు (రంధ్రాలు) చేసి ఉన్నాయి. ఆలయ గోడలపై గజకేసరి (ఏనుగు, సింహం) చిత్రాలు మలచబడి ఉన్నాయి. కాకతీయ రాజ్యాన్ని స్వాధీన పర్చుకున్నామని చాటడానికి చిహ్నంగా విజయనగర రాజులు ఈ గజ కేసరి విగ్రహాలను చెక్కించారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. మొదట్లో ఆలయం పైకి చేరడానికి మెట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. తర్వాత దేవాలయాన్ని చేరుకునేందుకు గుట్టపైకి 125 మెట్లను నిర్మించారు. 1971 వరకు డిచ్‌పల్లి సర్పంచ్‌గా ఉన్న గజవాడ చిన్నయ్య రాజస్థాన్ నుంచి శ్రీసీతారామ లక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలను తెప్పించి ప్రతి ష్ఠింప జేశారు. అప్పటి నుంచి రామాలయంగా ప్ర సిద్ధి చెందింది. ఆలయ ధర్మకర్తగా చిన్నయ్య ఆల యంలో నిత్యనైవేద్యం, పూజలు చేసేందుకు పూజారిని ఏర్పాటు చేశారు. పూజారి జీవనోపాధికి 2ఎకరాల భూమిని దేవాలయం పేర ఏర్పాటు చేశారు.

శ్రీసీతారాముల కల్యాణం..

ఈనెల 10న మాఘ శుక్ల త్రయోదశి ఉదయం 12.30 గంటలకు నిత్యహోమం, బలిహరణం, మధ్యాహ్నం 2.01 గంటలకు శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు నిత్యహోమం, బలిహరణం, అశ్వసేవ, హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. కల్యాణ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యే అవకాశం ఉంది.

మొదటి రోజు..

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం సాయంత్రం 8 గంటలకు ఆలయ అర్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పుణ్యహవాచనం, అంకురార్పణం, ముత్సంగ్రహణము, అఖండదీపారాధన, రక్షాబంధనం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, గ్రామపెద్దలు బూస సుదర్శన్, లొక్కిడి యాదగిరి, గజవాడ రేణుకదాస్, గడ్డం లక్ష్మణ్, గురడి నర్సారెడ్డి, బూస నర్సింలు, గడ్డం కిష్టారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవం..

ఈనెల 12న మాఘ శుక్ల పౌర్ణమి ఉదయం 10 గంటలకు నిత్యాహోమం, బలిహరణం, సాయంత్రం 4గంటలకు నిత్యాహోమం, బలిహరణం, రాత్రి 8 గంటలకు రథ ప్రతిష్ఠ, రథహోమం, బలిహరణం, రథోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవ వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పాల్గొననున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రోజుకొక దాత భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

యేటా రెండుసార్లు..


ప్రతి ఏటా మాఘ శుక్లపక్ష ఏకాదశి నుంచి మాఘ విదియ వరకు దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. మాఘ శుక్ల త్రయో దశి రోజు శ్రీసీతారామకల్యాణం జరపడం ఇక్కడి విశేషం. అలాగే శ్రీరామనవమి రోజు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. దీంతో ఏటా రెండుసార్లు వైభవోపేతంగా జరిగే స్వామి వారి కల్యాణోత్సవ వేడకలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఆలయం కింద కుడివైపున రెండువందల ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువును కాకతీయుల కాలంలో నిర్మించారు. చెరువు మధ్యలో ఉన్న మండపం చూపరులకు ఆకట్టుకుంటుంది.




స్వాగత తోరణం.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

కేబినెట్‌లో బెర్త్.. నిరాశే

- జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు షాక్
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధిష్టానం నిర్ణయంతో గుబులు
- బీజేపీ ప్రాబల్యం రోజురోజుకూ పెరుగుతుండడంతో హస్తం శ్రేణుల్లో గందరగోళం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు గడిచినప్పటికీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కేబినెట్‌లో బెర్త్ లభించలేదు. ఎప్పటికప్పుడు దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల తరువాత అంటూ, సీఎం ఢిల్లీ వెళ్లివచ్చినప్పుడు సైతం త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు వచ్చాయి. అయినప్పటికీ విస్తరణ చేయలేదు. ఉత్తర తెలంగాణలోని కీలకమైన నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి కేబినెట్‌లో స్థానం లేకపోవడంతో పదవిని ఆశిస్తున్న బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చుట్టపుచూపుగానే వస్తుండడంతో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సైతం నిధులు, ఇతర కీలకమైన పనుల విషయమై, పరిష్కరించే విషయంలో అసహనానికి గురవుతున్నారు. జిల్లా నుంచి మంత్రి ఉంటేనే ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో అనుకున్న విధంగా ముందుకెళ్లే అవకాశముంటుందని నాయకులు కేబినెట్ విస్తరణ కోసం ఎదురు చూస్తూ వచ్చారు. ఈ క్రమంలో తాజాగా అధిష్టానం ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదని తేల్చడంతో నాయకులు, శ్రేణులు షాక్‌గు గురయ్యారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినాయకత్వం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల కార్యకర్తలు, నాయకుల్లో గుబులు రేగుతోంది. ముఖ్యంగా జిల్లాలో బీజేపీ గ్రామస్థాయిలో రోజురోజుకూ ప్రాబల్యం పెంచుకుంటుండడంతో హస్తం పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నాయి.

■ ఇతర జిల్లాలు, సామాజిక సమీకరణాలతో మంత్రివర్గ విస్తరణ విషయాన్ని ముడిపెట్టడంతో ఒక కొలిక్కి రావడం లేదు. ఇది ఎప్పటికి కొలిక్కి వస్తుందో అనేది తెలియని పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పట్లో జిల్లాకు మంత్రి పదవి కేటాయించకపోతే క్షేత్రస్థాయిలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని పార్టీ నాయకులు వాపోతున్నారు. స్థానిక సంస్థలైన పంచాయతీలు, పరిషత్‌లు, మున్సిపాలిటీలు, నిజామాబాద్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బలమైన బీజేపీని ఢీకొట్టడం అంత తేలిక కాదని వారంటున్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, ఉన్నత శ్రేణి ప్రజల్లోకి బీజేపీ మరింతగా చొచ్చుకెళుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ అధినాయకత్వం నిర్ణయం శరాఘాతంలాంటిదని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు చెబుతున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు క్షేత్రస్థాయిలో కష్టపడిన తమకు అధికారం దక్కినప్పటికీ ప్రజలకు సేవలందించే విషయంలో ఆశించిన మేర ముందుకెళ్లే పరిస్థితి లేకుండా పోతోందని వాపోతున్నారు. జిల్లాకు మంత్రి పదవి ఇస్తేనే ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ఆశించిన ఫలితాలు ఉంటాయని తద్వారా స్థానిక ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు వస్తాయని అంటున్నారు.

■ మరోవైపు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారు రానురాను మరింత నిరాశకు గురవుతున్నారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లాలో నుడా డైరెక్టర్ల పదవుల కోసం ఎదురుచూస్తున్న వారు రోజు రోజుకూ నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇంకా ఎన్నిరోజులు ఎదురుచూడాలని అంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పట్లో తమకు నామినేటెడ్ పదవులు దక్కవని, తరువాత కూడా ఎంత కాలం ఎదురుచూడాలో అని నిట్టూరుస్తున్నారు.

డీసీసీ అధ్యక్షుడి మార్పు..!

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని మార్చనున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అధ్యక్షుడుగా ఉన్న మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండడంతో మార్పు తప్పనిసరిగా చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా టీపీసీసీ కార్యవర్గాన్ని కూర్పు చేసేందుకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండుమూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డీసీసీని సైతం మార్చనున్నట్లు సమాచారం. అయితే జిల్లా నుంచి పార్టీ పదవుల కంటే నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూసేవారే ఎక్కువగా ఉండడం విశేషం.


నగరంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీ శ్రేణుల సంబరాలు

సుభాష్‌నగర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై నగరంలో శనివారం పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు బీజేపీ కార్యాలయం నుంచి నిఖిల్‌సాయి చౌరస్తా వరకు నృత్యాలు చేస్తూ ర్యాలీగా వచ్చారు. అనంతరం బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు అందించిన ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే వ్యతిరేకత వచ్చిందన్నారు.

ఢిల్లీ విజయంపై ఎంపీ హర్షం

ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తాను ప్రచారం చేసిన ఆర్‌కే పురం, జంగ్‌పుర నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు అనిల్ శర్మ, తర్వీందర్ సింగ్ గెలుపొందడంతో వారిని ఢిల్లీలో కలిసి సన్మానించారు. ఈ విజయాన్ని ప్రధాని మోదీకి అంకితమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- నిర్లక్ష్యం, తప్పిదాలకు పాల్పడితే చర్యలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- నగరంలో ఎమ్మెల్సీ పోలింగ్ సిబ్బందికి శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: ఈనెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై పోలింగ్ సిబ్బంది పూ ర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో శనివారం నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహా య ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలపై ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల రోజున గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో కలిసి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి ఒకరోజు ముందుగానే చేరుకోవాలన్నారు. సిబ్బందికి కేటాయించిన సామగ్రి చెక్ లిస్ట్‌లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా ఉందా? లేదా? అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలన్నారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్ప డే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ముగిసిన మీదట వాటిని కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. అనంతరం పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్లు హన్మాండ్లు, వర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, వివిధ మండలాల తహసీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సారెస్పీలోనే మొసళ్ల విడుదల

- చెరువులు, కుంటల్లో దొరికిన వాటిని వదులుతున్న అధికారులు
- కాలువల ద్వారా తిరిగి చెరువుల్లోకి చేరుతున్న జలచరాలు

బాల్కొండ: చెరువులు, ఇతర ప్రాంతాల్లో లభించిన మొసళ్లను ఫారెస్ట్ అధికారులు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో వదులుతున్నారు. అయితే ఆ మొసళ్లు మళ్లీ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల సమయంలో కాలువల ద్వారా నీటి ప్రవాహంలో ప్రయాణించి చెరువులు, కుంటల్లోకి చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా చెరువుల్లో లభించిన మొ సళ్లను యథావిధిగా ప్రాజెక్ట్‌లో, ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో వదలడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంధించిన మొసళ్లను సముద్రంలో వదిలివేయాలని డిమాండ్ చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల గోదావరిలో గతంలో అనేక మార్లు మొసళ్లను ఫారెస్ట్ అధికారులు వదిలారు. ఈ క్రమంలో మెండోరా మండలం దూదిగాం జాతీయ రహదారి 44 పైకి పెద్ద మొసలి వచ్చింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో వదిలిన మొసలి

ఆందోళనలో మత్స్యకారులు..

ప్రాజెక్టులో మొసళ్లను వదలడంపై చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోర్తాడ్ మండలం తాళ్ల రాంపూర్‌లో బంధించిన మొసలిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోని లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ఫారెస్ట్ అధికారులు వదిలివెళ్లారు. ప్రవహించే నీటిలో కాకుండా నిల్వ ఉన్న ప్రాజెక్ట్‌లో వదలడంతో తాము ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్ట్‌లో మొసలిని వదిలిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భయంగా ఉంది..

చెరువుల్లో పట్టుకున్న మొసళ్లను అధికారులు తీసుకువచ్చి పోచంపాడ్ ప్రాజెక్ట్‌లో వదులుతున్నారు. మేము రోజూ చేపల వేటకు వస్తుంటాం. ఇలా వదిలితే మొసళ్లు మా ప్రాణాలు తీసే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి మొసళ్లను ప్రాజెక్ట్‌లో వదలకుండా చర్యలు తీసుకోవాలి.

– తోకల సాగర్, మత్స్యకారుడు, రెంజర్ల

తాళ్లరాంపూర్‌లో మొసలి కలకలం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం తెల్లవారు జామున మొసలి సంచారం కలకలం సృష్టించింది. గ్రామంలోని సీతారాముల ఆలయం వెనుక ఉన్న చెరువు నుంచి బయటకు వచ్చిన మొసలి ఉన్నత పాఠశాల సందులో నుంచి రోడ్డుపైకి చేరింది. వెంటనే స్థానికులు గమనించి కమ్మర్‌పల్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు రేంజర్ రవీందర్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మొసలిని బంధించి, శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో విడిచిపెట్టారు. మొసలి చిన్నగా ఉన్నప్పుడు వాగులు, ఒర్రెల ద్వారా చెరువులోకి చేరుకుని ఉంటుందని, దానికి సరైన ఆహారం లభించక బయటకు వచ్చి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు సందేహం వ్యక్తం చేశారు. ఆరు నెలల కిందే ఓ మొసలి ఆలయ సమీపానికి చేరుకోగా స్థానికుల అలజడికి అది మళ్లీ చెరువులోకి వెళ్లిపోయింది. చెరువులో రెండు, ఇక్కడి కుంటలో మరో మొసలి ఉందని స్థానికులు చెబుతున్నారు. మొసలి భయానికి ఎవరు కూడా చెరువు, కుంట వైపు వెళ్లడం లేదని గ్రామస్తులు తెలిపారు.


తాళ్లరాంపూర్‌లో జనావాసాల మధ్యకు వచ్చిన మొసలిని బంధించిన స్థానికులు

క్లుప్తంగా

ఢిల్లీ ఓటర్లు ప్రజా పాలనను కోరుకున్నారు : దినేష్

సుభాష్‌నగర్ : ఢిల్లీ ఓటర్లు ప్రజాపాలన కోరుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. బీజేపీకి అఖండ విజయాన్ని అందించిన ఢిల్లీ ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో జరగనున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఢిల్లీ ఫలితాలే పునరావృతం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఘనంగా భీష్మ ఏకాదశి



డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో భీష్మ ఏకాదని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ భీష్ముని చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ ఆంజనేయస్వామి, జిల్లా కాంగ్రెస్ ఫిషరీష్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్ ఉన్నారు.

10న ప్రజాసంఘాల ధర్నా



నిజామాబాద్ సిటీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు సంబంధించి ఎలాంటి కేటాయింపులు లేకపోవడం, కేవలం కార్పొరేట్ శక్తులకు మేలుచేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని మండిపడ్డారు.మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు నూర్జహాన్, పెద్ది వెంకట్రాములు, వెంకటేష్, శంకర్ గౌడ్, గంగాధర్, నన్నేసాబ్, విజయ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో నిరాశ నింపిన మొక్కజొన్న

- గత సీజనుతో పోల్చితే తగ్గిన మక్కల ధర
- జొన్నలకు ప్రత్యామ్నాయంగా సాగు



మోర్తాడ్‌లో ఆరబోసిన మక్కలు

మోర్తాడ్(బాల్కొండ): యాసంగి మక్కల ధర తగ్గిపోయి రైతుల్లో నిరాశ నింపింది. గత సీజనుతో పోల్చితే ధరలో చాలా వ్యత్యాసం ఉండటంతో ఎక్కువ లాభం ఉండబోదని రైతులు వాపోతున్నారు. ఎర్ర, తెల్లజొన్నలకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులకు మక్కల ధర ఆశాజనంగా ఉండి ఉంటే ప్రయోజనం దక్కేది. ప్రస్తుతం క్వింటాల్ మక్కలకు రూ.2,260 వరకు ధర పలుకుతుంది. గతంలో ఒక్కో క్వింటాలుకు రూ.3వేల వరకు ధర పలుకగా కనీసం ఈసారి రూ.2,500ల వరకు ధర పలకడం లేదని రైతులు చెబుతున్నారు. పౌల్ట్రీ పరిశ్రమ, బిస్కెట్ కంపెనీలకు మక్కల ఎగుమతి ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలం సీజనులో సాగైన మక్కలను మహారాష్ట్ర, గుజరాత్ వ్యాపారులు మన జిల్లా నుంచి దిగుమతి చేసుకున్నారు. అప్పట్లో మక్కలకు ధర రూ.2,300ల నుంచి రూ.2,800ల వరకు పలికింది. ఈ సీజనులో మొక్కజొన్న పంటను కోయడం రైతులు ఆరంభించగా వ్యాపారులు పచ్చి మక్కలనే కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం పరిగణనలోకి తీసుకోకుండా మక్కలను తూకం వేసి తీసుకెళ్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మక్కలకు రూ.2,290 మద్దతు ధర ఉంది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే మక్కలకు తేమ శాతం తక్కువగా ఉండాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజనులో పసుపులో అంతర్ పంటగా మొక్కజొన్నను సాగు చేసిన రైతులు యాసంగి సీజనులో మాత్రం విడిగానే సాగు చేశారు. దీంతో ఒక్కో ఎకరానికి 40 క్వింటాళ్లకు మించి దిగుబడి లభిస్తుంది. దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల మక్కలకు ఇప్పుడు పలికిన ధర వల్ల లాభమే తప్ప నష్టం ఏమి ఉండదని వ్యాపారులు చెబుతున్నారు. సాగు ఖర్చులు పెరుగుతుండటంతో ధర ఎంత ఎక్కువ ఉంటే అంత లాభం అని ఒక పంట వల్ల లాభం తగ్గినా మరో పంట వల్లనైనా ఊరట లభిస్తుందనే అభిప్రాయాన్ని మెజార్టీ రైతులు వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న కోతలు మొదలు కావడంతో మక్కల కొనుగోళ్లకు వ్యాపారులు ఉత్సాహం చూపుతున్నారు.

ఆకట్టుకున్న రంగోలి పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

మోపాల్: మండలంలోని కంజర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శనివారం సైన్స్ రంగోలి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభతో ఆధునిక సాంకేతిక, పచ్చదనం, భూమి, వాతావరణ పరిరక్షణ, ఇస్రో, కాలేయం, గుండె, తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈపోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రిన్సిపాల్ విజయ లలిత పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వినోద, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులు వేసిన రంగవల్లులు

జోరుగా రేషన్ దందా

- మహారాష్ట్రకు తరలుతున్న బియ్యం
- పట్టించుకోని అధికారులు



కొడిచర్లలో అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో రేషన్ దందా జోరుగా సాగుతోంది. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం వివిధ మార్గాల్లో మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు తరలుతోంది. కొందరు వ్యాపారులు మాఫియాగా ఏర్పడి జిల్లా సరిహద్దు గ్రామాలే అడ్డాగా చేసుకుని వివిధ మార్గాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం కొడిచర్లలో 38 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మెండోరా పోలీసులు పట్టుకున్నారు. గతంలో ఇదే గ్రామంలోని ఓ రైస్‌మిల్లులో 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కొందరు మండల కేంద్రం నుంచి బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు రూ. 10 చొప్పున సేకరిస్తున్నారు. అక్కడి నుంచి బాల్కొండలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వ్యాపారులకు కిలో రూ. 15కు విక్రయిస్తారు. ఇలా అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని జిల్లా సరిహద్దు గ్రామాల్లో నిల్వ ఉంచుతున్నారు. అర్ధరాత్రి వేళల్లో డీసీఎం వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇక్కడ రూ. 10కి కొనుగోలు చేసిన బియ్యాన్ని మహారాష్ట్రలో కిలో రూ. 22 చొప్పున విక్రయిస్తున్నారు. ఇదంతా పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మల్, నిజామబాద్ జిల్లాలకు సరిహద్దు గ్రామాలుగా దూదిగాం, కొడిచర్ల, చాకిర్యాల్, సావెల్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలను కేంద్రాలుగా చేసుకుని రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచుతున్నారు. ఇలా పేదల బియ్యంపై పెద్దల కన్ను వేసి తమ దందాను మూడు పువ్వులు.. ఆరు కాయలుగా చేసుకుంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమంగా తరలకుండా తగు చర్యలు తీసుకోవాల్సినవ అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం..

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఇది వరకే పలు మార్లు తనిఖీలు నిర్వహించాం. అక్రమంగా రేషన్ బియ్యం దందా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాస్, డీటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్

డిప్యూటీ డీఎంహెచ్‌వోలో ఉద్యోగులేరీ?

- మధ్యాహ్నమే ఖాళీగా కుర్చీలు
- కానరాని అధికారుల పర్యవేక్షణ



నిజామాబాద్ నాగారం: వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా అధికారి రాజశ్రీ ఒకవైపు తనిఖీలు చేస్తున్నా.. మరోవైపు కొంతమంది ఉద్యోగులు వాటిని లెక్కచేయకుండా విధులకు డుమ్మా కొడుతున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కార్యాలయాలకు ఇలా వచ్చి అలా వెళుతున్నారు. జిల్లా కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎవరు అందుబాటులో లేరు. ఉదయం సమయంలో వారు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సరైన పర్యవేక్షణ చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు నూతన పద్ధతిలో విద్యాబోధన

- ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- డీఈవో అశోక్ కుమార్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ రూరల్ : విద్యార్థులకు నూతన పద్ధతిలో విద్యాబోధన చేయాలని డీఈవో అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని గూపన్‌పల్లి, కోటగల్లిలోని శంకర్‌భవన్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం లర్నింగ్ ఎడ్యుకేషనల్ సిస్టమ్ (ఎల్ఎంఎస్) ఓపెన్ ఎడ్యుకేషన్ రీసోర్స్ (ఓఈఆర్)పై మండల స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రొజెక్టర్ ద్వారా ఎలా బోధించాలో డీఈవో వివరించారు. అనంతరం సమగ్ర శిక్ష జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి , ఏఎంవో జీవన్‌లు ఉపాధ్యాయులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎంఈఎస్ ప్రొబెషనరీ అధికారుల పర్యటన



అదనపు కలెక్టర్ అంకిత్‌ను కలిసిన ఎంఈఎస్ ప్రొబెషనరీ అధికారుల బృందం

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రొబెషనరీ(ఎంఈఎస్) అధికారుల బృందం పర్యటన శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా అధికారులు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌లను కలిశారు. క్షేత్రస్థాయిలో గమనించిన అంశాలను వారి దృష్టికి తీసుకువచ్చారు. తమ శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో వివిధ అంశాల అధ్యయనం కోసం 30 మందితో కూడిన అధికారులను ఆరు బృందాలుగా విభజించి క్షేత్రస్థాయి అధ్యయనం జరిపించారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, సుంకెట్, దొన్కల్, నందిపేట మండలంలోని సిద్దాపూర్, వన్నెల్(కె), వెల్మల్ గ్రామాలతో పాటు జిల్లా కేంద్రంలో ప్రొబేషనరీ అధికారులతో కూడిన బృందాలు ఎనిమిది రోజుల పాటు వివిధ వర్గాలను కలిసి వారి పనితీరును, ఆయా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అనంతరం ట్రైనీ అధికారులకు డీఆర్డీవో సాయాగౌడ్, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు వీడ్కోలు పలికారు.

విలేకరిపై కేసు నమోదు

- ఎక్సైజ్ సీఐలను బెదిరించిన ఘటనలో..

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ సీఐలను బెదిరించిన ఘటనలో ఓ ఈ–పేపర్ విలేకరిపై కేసు నమోదైంది.వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలీప్‌ను మూడు రోజుల క్రితం ఓ విలేకరి కల్లుడిపోల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని బెదిరింపులకు దిగాడు. దీనిపై వార్తలు రాయకుండా ఉండాలంటే రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ దిలీప్ ఫిర్యాదు మేరకు నాలుగో పోలీస్ స్టేషన్‌లో విలేకరిపై కేసు నమోదైంది. అలాగే నిరాధార ఆరోపణలు చేస్తూ వార్తా కథనాలు రాసి డబ్బులు డిమాండ్ చేశాడని సదరు విలేకరిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

లభించని గల్లంతైన యువకుడి మృతదేహం

- కొనసాగుతున్న గాలింపు చర్యలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో శుక్రవారం సాయంత్రం గల్లంతైన యువకుడి మృతదేహం ఇప్పటికీ లభించలేదు. పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన చిన్న చెవ్వ సాయికుమార్ (24) అనే యువకుడు తన తండ్రితో కలిసి బట్టలు ఉతక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు పడి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం చీకటిపడిన తర్వాత గాలింపు చర్యలు నిలిపివేసిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది శనివారం ఉదయం నుంచి చెరువులో గాలించారు. చీకటిపడినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం తిరిగి గాలింపు చర్యలు చేపడతామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్

పీడీఎస్ బియ్యం పట్టివేత



వర్ని (మోస్రా) : మోస్రా మండల కేంద్రంలో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లై, టాస్క్ ఫోర్సు అధికారులు శనివారం పట్టుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో దుకాణంపై దాడులు చేశారు. ఈమేరకు 25 క్వింటాళ్ల అక్రమ పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని వర్ని పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

బాల్కొండ : మండల కేంద్రానికి చెందిన వేంపల్లి కృష్ణ అలియాస్ నర్సయ్య (46) చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాలతో కృష్ణ శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ



బిచ్కుంద(జుక్కల్) : మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును చోరీ చేసిన ఘటన మండలంలోని పెద్ద తక్కడ్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మేకల బాలమణి శనగ చేనులో పంటను కోస్తుండగా.. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె దగ్గరికి వచ్చి తాగడానికి నీళ్లు అడిగారు. ఈక్రమంలో మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకొని దద్గి గ్రామం వైపు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకొని ఆయా గ్రామాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

వ్యక్తిపై రాళ్లదాడి చేసి.. బంగారం ..



పిట్లం(జుక్కల్): ఓ వ్యక్తిపై శుక్రవారం అర్ధరాత్రి రాళ్ల దాడికి పాల్పడి బంగారం చోరీ చేసిన ఘటన మండలంలోని సిద్ధాపూర్ తండాలో చోటు చేసుకుంది. బాధితుడు గోపాల్, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన కేతావత్ కవిత తన భర్త గోపాల్, కూతురు క్రాంతిక తో కలిసి శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రపోయారు. అర్ధరాత్రి ఒకటన్నర గంటల సమయంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు గోపాల్‌పై రాళ్లదాడికి పాల్పడి బెదిరించారు. తన భార్య కవిత చెవులకు ఉన్న రెండు గ్రాముల బంగారు కమ్మలను చోరీ చేశారు. ఈమేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లెక్చరర్ ఇంట్లో ..

ఖలీల్‌వాడి : నగరంలో ధర్మపురిహిల్స్‌లో ఓ లెక్చరర్ ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మహ్మద్ ఇలియాస్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లారు. అతని భార్య బంధువులను పరామర్శించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తి తాళం పగలగొట్టి ఇంట్లో రూ.40 వేల నగదు, 17 తులాల బంగారం చోరీ చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితుడు ఇలియాస్ ఆరవటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చెట్టును ఢీకొన్న బైక్..యువకుడి మృతి



ఏగొండ (ఫైల్)

ఎల్లారెడ్డి: చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈఘటన మండలంలోని మీసాన్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన యువకుడు చాకలి ఏగొండ (18) ఎల్లారెడ్డి నుంచి తన గ్రామానికి వెళ్తుండగా మీసాన్‌పల్లి శివారులో చెట్టును బైక్ ఢీకొంది. ఈఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి అంజయ్య అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు ..



వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని గండివేట్‌కు చెందిన షేక్ అహ్మద్ (32) తన కుటుంబంతో బాన్సువాడలో నివాసం ఉంటున్నాడు. బైక్‌పై స్వగ్రామానికి వచ్చిన అహ్మద్ శుక్రవారం అర్ధరాత్రి తిరిగి బాన్సువాడకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మొండిసడక్ శివారులోని దర్గా వద్ద అహ్మద్ బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నస్రీమ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు



ధర్మారం(బి) శివారులో చెట్టును ఢీకొట్టిన కారు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామ శివారు పీహెచ్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై ఎండీషరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఆర్యనగర్ కు చెందిన జగన్, గణేష్, నరేష్, రమేష్ లు బుధవారం ఉదయం కరీంనగర్ లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి నిజామాబాద్‌కు వస్తుండగా ధర్మారం(బి) శివారులో మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జగన్ చెల్లెలు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..



నర్సయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సంపంగి నర్సయ్య(41) అనే వ్యక్తి తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వివరాల ప్రకారం.. అంకాపూర్‌కు చెందిన నర్సయ్య కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా శుక్రవారం తన ఇంట్లో భోజనం చేసి నిద్రించిన నర్సయ్య ఉదయం లేచేసరికి విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై గోవింద్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

ఐపీ పెట్టి పరారైన వ్యాపారి

- రూ.2 కోట్లకు కుచ్చుటోపి
- కామారెడ్డిలో బాధితుల ఆందోళన
- సామగ్రిని తీసుకెళ్లిన డిస్ట్రిబ్యూటర్‌లు



మెగామార్ట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రం లోని కొత్త బస్టాండ్ సమీపంలో సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్న ఓ వ్యాపారి దాదాపు రూ.2 కోట్లతో ఉడాయించిన ఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరాంనగర్ కాలనీకి చెందిన హబీబ్ అనే వ్యక్తి మూడేళ్ల క్రితం మెగామార్ట్ పేరిట ఓ సూపర్ మార్కెట్‌ను నెలకొల్పాడు. హోల్‌సేలర్స్ వద్ద ఉద్దెర్లపై వస్తువులు, తెలిసిన చాలా మంది వద్ద నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. 40 రోజులుగా దుకాణం తెరవకపోవడం, హబీబ్ కనిపించకపోవడంతో సరుకులు, అప్పులు ఇచ్చినవారు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం పదుల సంఖ్యలో బాధితులు సూపర్ మార్కెట్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇదివరకే పెద్ద మొత్తంలో సామగ్రిని మరోచోటకు తరలించి దుకాణానికి తాళం వేసినట్లు తెలుస్తుంది. సరుకులను సరఫరా చేసిన డిస్ట్రిబ్యూటర్‌లు దుకాణాన్ని తెరిచి మిగిలిపోయిన సామగ్రిని తీసుకువెళ్లారు. పది రోజుల క్రితమే పట్టణానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైనట్లు సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సదరు వ్యాపారి ఐపీ పెట్టినట్లు తెలిసింది. వ్యాపారం పేరుతో అప్పులు తీసుకుని ఉడాయించిన ఘటనలు పట్టణంలో గతంలోనూ వెలుగుచూశాయి.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలుకు ఎదురుగా వెళ్లి గుర్తు తెలియని యువకుడు (30) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. తిరుపతి నుంచి అకోలా వెళ్తున్న రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ రమేష్ సమాచారం అందించారని ఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడి సమాచారం తెలిసిన వారు నంబర్ 8712658591కు సమాచారం తెలపాలని కోరారు.